రోడ్లపై పార్కింగ్



- రాకపోకలకు ఇబ్బందులు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కేపీహెచ్‌బీ కాలనీవాసులు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో రోడ్లపై వాహనాల అక్రమ పార్కింగ్‌తో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా రోజంతా వాహనాలను రోడ్లపై పార్కు చేస్తుండటంతో ఇరుకుగా మారి రాకపోకలు సాగించేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. కాలనీలోని ప్రధాన రోడ్లు మొదలు కొని అంతర్గత రోడ్ల వరకు ఇదే పరిస్థితి నెలకొందంటే అతిశయోక్తి కాదు.

- ఒకప్పుడు కాలనీలో నివాసాలు అధికంగా ఉండేవి. నేడు ప్రతి వీధిలో వ్యాపారాలు, వాణిజ్య కేంద్రాలు వెలిశాయి. దీంతో రోజు ఇక్కడికి వచ్చి వెళ్లే వారి సంఖ్య కూడా పెరిగింది. దీంతో కేపీహెచ్‌బీ కాలనీ నిత్యం రద్దీగా ఉంటోంది.
- అనుమతులు లేకుండా అక్రమంగా వెలసిన బహుళ అంతస్తుల భవనాలు.. అధిక అద్దెలు లక్ష్యంగా కనీసం పార్కింగ్ కోసం స్థలం కూడా కేటాయించడంలేదు. దీంతో రోడ్లే పార్కింగ్ కేంద్రాలుగా మారాయి.
- కాలనీలోని ప్రధాన దారుల్లోని భవనాలు, ఆసుపత్రులకు, వస్త్ర వ్యాపార కేంద్రాలకు నిలయంగా మారాయి. దీంతో పగలంతా ఈ దారుల్లో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు అక్రమంగా పార్కు చేస్తున్నారు.
- అంతర్గత రోడ్లకు ఇరువైపులా ఉన్న ఎల్‌ఐజీ, ఎంఐజీ, ఈడబ్ల్యూఎస్ భవనాలు హాస్టల్స్‌కు అద్దెకు ఇచ్చారు. దీంతో హాస్టల్స్‌లో వసతి పొందుతున్న వారి వాహనాలు రాత్రి వేళల్లో రోడ్లపై వరుసగా పార్కు చేస్తున్నారు. దీంతో రాత్రిపూట రోడ్లన్ని వాహనాలతో నిండిపోతుండడంతో కార్లు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- కేపీహెచ్‌బీకాలనీలోని 7వ ఫేజులో 60 అడుగుల రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో రోడ్డు కుంచించుకు పోగా ఆ కాస్త మిగిలిన రోడ్డు పైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ఆపత్కాలంలో అంబులెన్స్ వచ్చే అవకాశం కూడా లేకుండా పోతోందని వారు ఆవేదన చెందుతున్నారు.
- జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే హడావిడి చేసి వెళ్లిపోతున్నారని అక్రమ పార్కింగ్‌కు దీర్ఘకాలిక పరిష్కారం చూపలేకపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కేపీహెచ్‌బీ కాలనీలోని అంతర్గత రహదారుల్లో అక్రమ పార్కింగ్

అధికారులు స్పందించాలి..

కేపీహెచ్‌బీ కాలనీలో రోడ్లపై వాహనాల అక్రమ పార్కింగ్ విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సత్వరం స్పందించాలి. విశాలమైన రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేసే వారిపై, అక్రమంగా వాహనాలు పార్కింగ్ చేసే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలి. కనీసం పార్కింగ్ సదుపాయం లేని భవనాలను గుర్తించి రెట్టింపు ఆస్తిపన్ను విధించాలి. ఇప్పటికైనా అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలి.

– అంజిబాబు, కేపీహెచ్‌బీకాలనీ 7వ ఫేజ్

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హిల్‌రిడ్జ్ విల్లాస్, హిల్ రిడ్జ్ అపార్ట్‌మెంట్స్, ఎల్లా హోటల్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్కీ క్యాంపస్, జయభేరి పైన్ వ్యాలీ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు విద్యుత్ సరఫరాలో అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

మియాపూర్ : ఓల్డ్ ముంబాయి రోడ్డు ఫీడర్ మరమ్మతుల కారణంగా.. మంగళవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 11 గంటల వరకు చందానగర్ మెయిన్ రోడ్డు, బీహెచ్‌ఈఎల్ ఏరియా, వేముకుంట, ఓల్డ్ ముంబాయి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.

కవిత జన్మదిన వేడుకలు



వార్డు కార్యాలయంలో చీరలు అందజేస్తున్న నాయకులు

శేరిలింగంపల్లి: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను శేరిలింగంపల్లి వార్డు ఆఫీస్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మహిళలతో కలిసి కేక్ కట్ చేయడంతో పాటు చీరలను అందజేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు ఆర్.సుజాతయాదవ్, వీరేశంగౌడ్, స్వరూప, గోపాల్‌యాదవ్, అనిరుధ్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, శ్రీకళ, పర్వీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

మనూను సందర్శించిన 'సూడాన్' బృందం

రాయదుర్గం: సూడాన్ దేశంలోని వైట్‌నైల్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం సోమవారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. వీసీ సయ్యద్ ఐనుల్ హసన్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. వైట్‌నైల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎల్హాజలి ఈ సాహమద్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం రెండు విశ్వవిద్యాలయాల మధ్య సహకారం, సంభావ్యతపై చర్చించారు. విద్యార్థి, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలు మరియు ఉమ్మడి పరిశోధనా ప్రాజెక్టులపై పరస్పర అంగీకారం తెలిపారు.

రోడ్డుపై మురుగు



మియాపూర్ : మియాపూర్‌లోని దత్తసాయి కాలనీలో మ్యాన్‌హోల్‌ల నుండి మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో స్థానిక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. గత కొన్ని రోజులుగా మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో దుర్వాసన, దోమలతో అనారోగ్యం పాలవుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మహిళల రక్షణపై సింపోజియం

రాయదుర్గం: డిజిటల్ స్పేస్‌లో మహిళల రక్షణపై మనూలో నేడు ప్రత్యేక సింపోజియంను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డీడబ్ల్యూ హెడ్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ అమీనా తహసీన్ తెలిపారు. 'లింగ సమానత్వం మరియు డిజిటల్‌లో మహిళల రక్షణ' అనే అంశంపై మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు క్యాంపస్‌లోని సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో సింపోజియం నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

త్వరలో సీసీ రోడ్డు నిర్మాణం

ఆల్విన్‌కాలనీ: సాయినగర్ వెస్ట్‌లో ఎర్రపోచమ్మ దేవాలయం వద్ద రోడ్‌నం.4లో సీసీరోడ్డు వేయనున్న ప్రాంతాన్ని సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ వీధిలో ఇటీవలే డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని తెలిపారు. సీసీ రోడ్డు పనులను త్వరలో ప్రాంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు.



అభివృద్ధికి ప్రతీకలుగా పటాన్‌చెరు పల్లెలు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రతి గ్రామాన్ని అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండల పరిధిలోని పెద్ద కంజర్ల, చిన్న కంజర్ల, ఐనోలు, క్యాసారం గ్రామాల పరిధిలో రూ.6.65 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, హై లెవెల్ బ్రిడ్జి, అంతర్గత మురుగునీటి కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చిన్నకంజర్ల, ఐనోలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీ కెమెరాలను ప్రారంభించారు. పెద్ద కంజర్ల గ్రామ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఐనోలు గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ శంకర్ రెడ్డి సొంత నిధులతో అందించిన వైకుంఠ రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పల్లెలు నేడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. దళిత బంధుతో దళితుల ఆర్థిక అభ్యున్నతికి పాటుపడుతున్నామని తెలిపారు. త్వరలోనే మరో 1,100 యూనిట్లు అందించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకం కింద ఖాళీ స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే వారికి రూ.3 లక్షలు అందించేందుకు ప్రభుత్వం త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదం

పటాన్‌చెరు: మానసిక ఆరోగ్యంతోపాటు శరీర దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. పటాన్‌చెరు పరిధిలోని పరిశ్రమల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు క్రీడా పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతగా నిలిచిన ఎంఆర్‌ఎఫ్, రన్నరప్‌గా నిలిచిన ఓడీఎఫ్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, గూడెం మధుసూదన్‌రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, ఎండీఆర్ ఫౌండేషన్ కో ఫౌండర్ పృథ్వీరాజ్, ఫౌండేషన్ అధ్యక్షుడు మధు, క్రీడాకారులు పాల్గొన్నారు.

లింగంపల్లి స్టేషన్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో రైల్వే డీఆర్‌ఎం ఏకె గుప్తా అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. స్టేషన్ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ఇంజనీరింగ్, ఇతర విభాగాల అధికారులతో చర్చించారు. స్టేషన్‌లోని 1వ ప్లాట్‌ఫారం వైపు నుంచి పాత మున్సిపల్ ఆఫీస్ వరకు ఉన్న రోడ్డును అభివృద్ధి చేయడంతో పాటు పార్కింగ్ తరలింపు, స్టేషన్‌కు ప్రయాణికుల రాకపోకలు సులువుగా సాగించేందుకు గేట్ల ఏర్పాటు తదితర విషయాలపై చర్చించారు. బైక్ పార్కింగ్ ఏరియాల్లో ఆటోలు నిలపడంతో ఆ కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిమాన విధించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు.



అధికారులకు సూచనలిస్తున్న రైల్వే డీఆర్‌ఎం ఏకె.గుప్తా

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు



హైస్కూల్ వద్ద పోలీసు బందోబస్తు

శేరిలింగంపల్లి: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు శేరిలింగంపల్లిలో ప్రశాంతంగా జరిగాయి. శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శేరిలింగంపల్లి పోలింగ్ స్టేషన్‌లో 652 మంది ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాన్ని శేరిలింగంపల్లి తహశీల్దార్ వంశీమోహన్, డిప్యూటీ కమిషనర్ వెంకన్నలు పరిశీలించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు రాఘవేందర్ రావు, కర్నర్ల ఎల్లేష్, కృష్ణ ముదిరాజ్, రామ్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, రాజుశెట్టి, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హాత్ సే హాత్ జోడో యాత్ర

రాయదుర్గం: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడోయాత్రను రాయదుర్గంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ చేసిన అభివృద్ధి, పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పార్టీ టీపీసీసీ ప్రతినిధి సత్యనారాయణరావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణకు చేసిందేమీలేదన్నారు. రాష్ట్రంలో కొన్ని కుటుంబాలే బాగుపడ్డాయని, ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కౌశల్ సమీర్, ఇలియాస్ షరీఫ్, ఈశ్వర్, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేర నివారణలో సీసీ కెమెరాలు కీలకం

పటాన్‌చెరు టౌన్: ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని..నేరాలను అరికట్టడంలో వీటి పాత్ర కీలకమని పటాన్‌చెరు డీఎస్పీ భీం రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామంలో మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలసి డీఎస్పీ ప్రారంభించారు. అనంతరం భీంరెడ్డి మాట్లాడుతూ పటాన్‌చెరు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్రైం సీఐ బీసన్న, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మనూలో యునానీ హెల్త్ క్యాంప్

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ సూచించారు. యూనివర్సిటీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ, నేషనల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యునానీ మెడిసిన్ ఫర్ స్కిన్ డిజార్డర్స్ (ఎన్‌ఆర్‌ఐయూఎంఎస్‌డీ) హైదరాబాద్‌తో కలిసి సోమవారం యునానీ హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ వ్యాయామం, వాకింగ్, సైక్లింగ్ చేయాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే చదువు, ఉద్యోగం, ఇతర విధులను సక్రమంగా చేయడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. సాంప్రదాయ, ప్రత్యామ్నాయ వైద్యం యొక్క ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయన్నారు. కాగా క్యాంపస్‌లో యునానీ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తామని ఎన్‌ఆర్‌ఐయూఎంఎస్‌డీ ఇన్‌చార్జీ డైరెక్టర్ డాక్టర్ అహ్మద్ మిన్హాజుద్దీన్ వెల్లడించారు.

స్నేహితుడితో గొడవపడి...

పటాన్‌చెరు టౌన్: స్నేహితుడితో గొడవ జరిగాక ఒకరు కనిపించకుండాపోయారు. ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం...మండల పరిధిలోని ఇస్నాపూర్ వడ్డెర కాలనీకి చెందిన లక్ష్మణ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 12వ తేదీన మద్యం మత్తులో లక్ష్మణ్, స్నేహితుడు నరసింహులు గొడవపడ్డారు. ఆ తర్వాత ఏం జరిగిందో.. లక్ష్మణ్ కనిపించకుండాపోయాడు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోందని లక్ష్మణ్ తల్లి పోచమ్మ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో జొమాటో డెలివరీ బాయ్ దుర్మరణం

గచ్చిబౌలి: లారీని ఓవర్ టేక్ చేయబోయి లారీ వెనుక చక్రాల కిందపడి జొమాటో డెలివరీ బాయ్ మృతి చెందాడు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శోభన్‌బాబు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ నందీనగర్‌లో నివాసం ఉండే శ్యామ్(33) జొమాటో ఫుడ్ డెలివరీ బాయ్. హోండా బైక్‌పై నానక్‌రాంగూడ నుంచి ఓఆర్‌ఆర్ రోటరీ వైపు వస్తుండగా నానక్‌రాంగూడ రోటరీ వద్ద సోమవారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో లారీని ఓవర్ టేక్ చేయబోయి ఢీ కొట్టాడు. వెనక చక్రాల కింద పడటంతో శ్యామ్‌కు నడుము భాగంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, కొడుకు కార్తీక్(9), కూతురు యజ్ఞత(8) ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

గచ్చిబౌలి: మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని రాయదుర్గం ఎస్ఐ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాయదుర్గం సర్వే నంబర్ 83, నాలెడ్జ్‌సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా 'మహిళల భద్రత–సైబర్ క్రైమ్'పై హోటల్‌లోని మహిళా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పని చేస్తున్న చోట, నివాసం ఉండే చోట లేదా ప్రయాణించే మార్గాల్లో ఎలాంటి వేధింపులకు గురైనా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితుల పేర్లను గోప్యంగా ఉంచుతారని వేధింపులకు పాల్పడిన వారి భరతం పడతామని ఆయన హెచ్చరించారు. షీ టీమ్ ట్విట్టర్, షీటీమ్ 9490617444, లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. నకిలీ యాప్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లతో మోసాలకు పాల్పడుతున్నారని అప్రమత్తంగా ఉండాలని మహిళలకు సూచించారు. సైబర్ క్రైం కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, అవగాహనతోనే కేసులు తగ్గుముఖం పడతాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సతీష్, షీ టీం సభ్యులు శ్రీకాంత్ పాల్గొన్నారు.



అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న రాయదుర్గం ఎస్ఐ ప్రమోద్‌కుమార్

డిజిటల్ ఆవిష్కరణల రూపకల్పనకు..

నాలెడ్జి సిటీలో అలైన్ ఇన్నోవేషన్ సెంటర్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జిసిటీలోని సలార్‌పురియా సత్వా నాలెడ్జ్ పార్కులో అలైన్ ఇన్నోవేషన్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. అలైన్ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ డిజిటల్ ఆఫీసర్ శ్రీలక్ష్మీ కొల్లి, సీనియర్ డైరెక్టర్, సెంటర్ జీఎం శ్రీనితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇండస్ట్రీకి చెందిన ప్రతిభావంతులను ఒకచోటకు చేర్చి డిజిటల్ ఆవిష్కరణలను నడిపించడంలో ఈ ఇన్నోవేషన్ సెంటర్ సహాయపడుతుందన్నారు. అలైన్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ డిజిటల్ డెంటిస్ట్రీ, ఆర్థోడాంటిక్స్‌ను అభివృద్ధి చేసి ఆవిష్కరణలను రూపొందించడానికి మా భాగస్వాములు కస్టమర్లతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న శ్రీలక్ష్మి

ఔషధ ఆవిష్కరణలో 'ఏఐఅండ్‌ఎంఎల్' కీలకపాత్ర



డాక్టర్ రాధారంగరాజన్

రాయదుర్గం: ఔషధ ఆవిష్కరణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏఐఅండ్‌ఎంఎల్) పాత్ర కీలకమని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్–సెంట్రల్ డ్రగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(సీఎస్ఐఆర్–సీడీఆర్ఐ) డైరెక్టర్ డాక్టర్ రాధారంగరాజన్ అన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్– 2023 ఏ వర్చువల్ వర్క్‌షాప్'ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ నూతన ఔషధాల ఆవిష్కరణ, అపరిష్కృత వైద్య అవసరాలను గుర్తించడం, క్లినికల్ ట్రయల్స్‌ను వేగవంతం చేయడంలో ఏఐ అండ్ ఎంఎల్ ఉపయోగపడతాయన్నారు. గురుస్ బోర్డు చైర్మన్ కో ఫౌండర్, సీఈఓ డాక్టర్ జగత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ యువ పరిశోధకులు, ఔషధ ఆవిష్కరణలో వారి నైపుణ్యాలు, జ్ఞానాన్ని మెరుగుపర్చడానికి ఒక వేదికను అందిస్తుందన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్ (ఎఫ్ఏబీఏ) ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పి రెడ్డన్న, డాక్టర్ అజిత్, కామత్, హెచ్‌సీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ బిందు మాధవరెడ్డి తదితరులు ప్రసంగించారు.

కంటి వెలుగు కేంద్రం పరిశీలన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీహిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎవరికైనా కంటి సమస్యలు ఉంటే ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు, ఆపరేషన్లు కూడా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏఎన్‌ఎం సిబ్బంది పాల్గొన్నారు.

మిల్లెట్స్ అల్పాహారం అందజేత

రాయదుర్గం: ఖాజాగూడలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో మిల్లెట్స్ అల్పాహారాన్ని స్థానికులకు అందించారు కామధేను ఆర్గానిక్, నయా మిల్లెట్స్, బీజేపీ నాయకులు అంజన్‌కుమార్‌లు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మూల అనిల్‌గౌడ్, నక్క శివకుమార్ మాట్లాడుతూ జంక్‌ఫుడ్ తినడం వల్ల అనారోగ్యాలకు గురవుతున్నారని మిల్లెట్స్‌తో తయారు చేసిన ఆహారపదార్థాలను తినడంపై అందరూ దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం సంవత్సరం మిల్లెట్స్ సంవత్సరం కావడంతో 365 రోజుల పాటు మిల్లెట్స్‌తో తయారు చేసిన అల్పాహారాన్ని ప్రతినిత్యం ఒక ప్రాంతంలో అందించాలని నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ యాదవ్, ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, సదానందం, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

దారిదోపిడీ

తుపాకీతో డ్రైవర్‌ను బెదిరించి..

పటాన్‌చెరు టౌన్: ఐదుగురు దొంగలు దారిదోపిడీకి పాల్పడ్డారు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర సామగ్రితో వెళుతున్న డీసీఎంను అడ్డగించారు. డ్రైవర్‌ను తుపాకీతో బెదిరించి సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఈ ఘటన భానూర్–బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. సీఐ వినాయక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఫ్లిప్‌కార్ట్ కంపెనీ నుంచి గజ్వేల్‌కు ఓ డీసీఎం వెళుతుండగా, పటాన్‌చెరు మండల పరిధిలోని కర్ధనూర్ సర్వీస్ రోడ్డు వద్ద ఐదుగురు కారులో వచ్చి అడ్డగించారు. డీసీఎం డ్రైవర్‌ను బలవంతంగా తమ వాహనంలో ఎక్కించుకున్నారు. కళ్లకు గంతలు కట్టారు. ఎందుకు ఇలా చేస్తున్నారని అడిగేలోపు తుపాకీతో బెదిరించారు. ఓ గంట తర్వాత కారులోంచి దింపారు. కళ్లకు కట్టిన గంతలు విప్పుకొని చూడగా, సుల్తాన్‌పూర్ ఎగ్జిట్–4 సర్వీస్ రోడ్డు వద్ద ఉన్నాడు. కొద్దిదూరంలో డీసీఎం ఉంది. అక్కడకు వెళ్లి చూడగా, డీసీఎంలో ఉన్న 20 బ్యాగులు కనిపించలేదు. సుమారు రూ.1,78,000 లక్షల విలువైన వస్తువులు చోరీ అయ్యాయని గుర్తించాడు. వెంటనే బాధితుడు పటాన్‌చెరు పోలీసులకు తెలుపగా వారు సంఘటన స్థలానికి వెళ్లాక పోలీసులు ఇది భానూర్–బీడీఎల్ ఠాణా పరిధిలోకి వస్తుందని వారికి సమాచారం ఇచ్చారు. డ్రైవర్ ఎండీ సత్తార్ ఫిర్యాదు మేరకు బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



దోపిడీ జరిగింది ఈ డీసీఎంలోనే..